క్లుప్తంగా

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ వకుల్ జిందల్



ముక్కాంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్, డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు సముద్రతీర ప్రాంతాలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చోడిపిల్లిపేట, చేపలకంచేరు, చింతపల్లి, కోనాడ గ్రామాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు ఆయన ముక్కాం సముద్రతీర ప్రాంతంలో శుక్రవారం పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. చేపలవేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, సీఐలు కేవీవీ విజయనాథ్, ఎన్వీ ప్రభాకర్, మత్స్యకారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ కొండమ్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కొండమ్మ

విజయనగరం ఫోర్ట్: విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. నగరంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. నెలసరి సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారం తప్పకుండా తీసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు..



శంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటిస్తున్న ఏపీయూడబ్ల్యూజే సభ్యులు

విజయనగరం అర్బన్: పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మహాభాష్యం శంకర్ అకాల మరణం బాధాకరమని పలువురు జర్నలిస్టులు అన్నారు. ఈ మేరకు ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు, సీనియర్ జర్నలిస్టులు ఎలిశెట్టి సురేష్, పంచాది అప్పారావు, రాధాకృష్ణ, లక్ష్మణరావు, శేషగిరి, లింగాల నరసింహరావు, చక్రవర్తి, బల్లమూడి నాగేంద్రప్రసాద్, శేఖర్, పాత్రో, గురుప్రసాద్, భరత్, డేవిడ్‌రాజు, జైరాజ్, రాజేష్ పాల్గొన్నారు.


విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్టేడియంపేటలో శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ. జగన్ మోహనరావు మాట్లాడుతూ.. ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జి. కుమారి, రమ, ఈశ్వరమ్మ, నాగమ్మ, అచ్చియ్యమ్మ, వరలక్ష్మి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతులతో మట్టి గణపతి విగ్రహాలు



మట్టి విగ్రహాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలు తయారు చేశారు. హెచ్‌ఎం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. రసాయన రంగులతో పూసిన విగ్రహాలకు పూజలు చేయకూడదని, ఆ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే జల కాలుష్యం జరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌కు చవితి సందడి..

- భారీ ఎత్తున విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు
- వాడవాడలా మట్టి విగ్రహాల పంపిణీ
- గణనాథుని ఉత్సవానికి ముస్తాబవుతున్న చవితి పందిళ్లు
- అనుమతులు తప్పనిసరి : ఎస్పీ వకుల్ జిందల్



శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సంఘ అధ్యక్షుడు ఎంపీ.గౌరీశ్వరరావు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గణపతి మట్టి విగ్రహాలను భక్తులకు అందజేస్తున్న గురాన అయ్యలు



మార్కెట్‌లో విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

విజయనగరం టౌన్: గణనాథుని పూజలకు ప్రజలు సన్నద్ధమయ్యారు. ఎక్కడ చూసినా చవితి సందడే నెలకొంది. వివిధ స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశాయి. కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో, షాపుల వద్ద వినాయకుల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు భారీ విగ్రహాలను కమిటీ సభ్యులు కొనుగోలు చేశారు. మంటపాలను విద్యుత్ అలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న సెట్‌లు చూపరులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు.

మట్టి విగ్రహాల పంపిణీ..

గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలను వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పంపిణీ చేశారు. జనసేన నాయకుడు గురాన అయ్యలు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యతన్నారు. పట్టణ శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలు, వినాయక వ్రతకల్ప పుస్తకాలు పంపిణీ చేశారు. అమ్మానాన్న స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెయ్యి విగ్రహాలు పంపిణీ చేశారు. అదేవిధంగా స్పార్క్ సొసైటీ వ్యవస్థాపకుడు పి.భవానీపద్మనాభం ఆధ్వర్యంలో రెండువేల విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు.

మార్కెట్ కిటకిట

వినాయక చవితిని పురస్కరించుకుని గంటస్తంభం, పరిసర ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడాయి. వినాయక విగ్రహాలు, పత్రులు, పండ్లు, పువ్వులు, కొబ్బరి, అరటి పండ్ల దుకాణాలతో పాటు వివిధ రకాలైన ఛత్రాలు, ప్లాస్టిక్ పూలదండల అమ్మకాలతో మార్కెట్ కళకళలాడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ మధ్యాహ్నామయ్యే సరికి వర్షం పడడంతో వ్యాపారులు కాస్త ఇబ్బంది పడ్డారు.

అనుమతులు తప్పనిసరి



గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, మంటపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి సంబంధించి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఉత్సవాలు నిర్వహించే వారందరూ గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ ద్వారా చలానా రుసుం చెల్లించి అనుమతులు పొందాలి. ప్రజలు సులభంగా సింగిల్ విండో విధానంతో అనుమతులు పొందవచ్చు. ఎన్‌ఓసీ, క్యూఆర్ కోడ్ ప్రింట్ తీసి సిద్ధంగా ఉంచుకోవాలి. తనిఖీలు చేపట్టేందుకు వచ్చే అధికారులకు కమిటీ సభ్యులు సహకరించాలి.

– వకుల్ జిందల్, ఎస్పీ, విజయనగరం

వినియోగంలోకి బేరా మిషన్

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వినికిడి లోపాన్ని నిర్ధారించే బేరా మిషన్ ఉన్నప్పటికీ అందుబాటులోకి తీసుకురాక పోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ పరీక్ష కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు విశాఖకు పరుగులు తీసేశారు. ఈ వ్యవహారంపై సాక్షి పత్రికలో 'బేరా పరీక్షకు విశాఖకు పరుగు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి బేరా మిషన్‌ను శుక్రవారం వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇకపై బేరా టెస్టింగ్ ఇక్కడే చేస్తామని ఈఎన్‌టీ వైద్యుడు అజయ్‌కుమార్ తెలిపారు.



రోగికి బేరా టెస్టు చేస్తున్న వైద్యుడు అజయ్‌కుమార్, ఆడియాలజిస్ట్ సంతోషి

కొండను తవ్వి.. ఎలుకను పట్టి..!

నెల్లిమర్ల రూరల్: కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారింది నెల్లిమర్ల రెవెన్యూ అధికారుల తీరు. మండలంలోని సతివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన జంక్షన్‌లో చెరువు గర్భాన్ని, ఆర్అండ్‌బీ రహదారిని ఆక్రమించి చాలా మంది షాపులు ఏర్పాటు చేశారు. ముందు రోజు కేవలం ఇద్దరి ఆక్రమణదారులకు మాత్రమే నోటీసులు అందజేసి..శుక్రవారం సుమారు 60 మందికి పైగా సిబ్బందితో భారీగా వెళ్లి పోలీస్ బందోబస్తు నడుమ ఒకే ఒక చిన్న లాండ్రీ షాపును జేసీబీతో తొలగించి వెనుదిరిగారు. కేవలం కక్షపూరితంగా తన షాపును తొలగించి, మిగిలిన పెత్తందారుల షాపులు మాత్రం అలానే ఉంచారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారంటూ పలువురు బహిరంగంగానే విమర్శించారు. పదుల సంఖ్యలో ఆక్రమణలున్నాయని.. వాటిని కూడా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సుదర్శనరావు వివరణకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



సతివాడలో లాండ్రీ షాపును తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అభినందనలు



కోర్టు కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులలో నిందితులకు జైలుశిక్ష ఖరారు కావడంతో క్రియాశీలకంగా పనిచేసిన టూటౌన్ కోర్టు కానిస్టేబుళ్లు డి.రాధిక, ఐ.శ్రీనివాసరావులను ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇదే స్ఫూర్తితో పనిచేసి మరిన్ని కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సాక్ష్యాలు సేకరించాలన్నారు. సాక్ష్యులను బ్రీఫింగ్ చేయాలని, సకాలంలో న్యాయస్థానాల్లో సాక్ష్యులను ప్రవేశపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

● మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు



సన్మానగ్రహీతలతో నిర్వాహకులు

విజయనగరం ఫోర్ట్: ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక కొప్పల వెలమ సంక్షేమ కల్యాణ మంటపంలో విశ్రాంత ఉపాధ్యాయలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి మంచి వ్యక్తులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉపాధ్యాయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి, గంట్యాడ జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, యాండ్రాపు తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకే 'నవతరోత్సవ్'



నవతరోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: యువతలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకే నవతరోత్సవ్ 2024 కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యక్రమం చైర్మన్ జయకృష్ణ, డైరెక్టర్ అశోక్ మంచుకొండ తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక విజయనగరం సెంట్రల్ రోటరీ క్లబ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల ఎనిమిదో తేదీన సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. చెస్, కబడ్డీ, టెన్నీకాయిట్, బాక్సింగ్, క్రికెట్, ఫ్యాన్సీ డ్రెస్, క్విజ్, స్పాట్ పెయింటింగ్, కుకింగ్, సైన్స్ ఫెయిర్, స్టార్ ఆఫ్ విజయనగరం, షటిల్ బ్యాడ్మింటన్, స్కిల్ డెవలప్‌మెంట్ , తదితర కార్యక్రమాలు నిర్వహించి అక్టోబర్ రెండో తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు అరిశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి రెయ్యి శంకర్‌రెడ్డి, టీఎల్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్లబ్ వారోత్సవాలు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఏడు వరకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నిరంతరం తమ వార్తల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసే జర్నలిస్టులను సత్కరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పలువురు జర్నలిస్టులు, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ గుంపిన నారాయణరావు, వైస్ గవర్నర్ ఆలవెల్లి శేఖర్, క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్ధనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయకుమార్, రీజియన్ సెక్రెటరీ సముద్రాల నాగరాజు, వాసవీక్లబ్ వనిత విజయం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, కార్యదర్శి కాపుగంటి రాధిక, కోశాధికారి గుంపిన దేవి విద్యాలక్ష్మి, బలభద్రుని నానాజీ, పేర్ల సీతారామయ్య శెట్టి, కుసుమంచి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యాన్ని తగ్గించాలి

విజయనగరం: వాయు కాలుష్యాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలనే ఉద్దేశంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీని వారు ప్రారంభించారు. నగరంలోని కోట జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ మూడు లాంతర్లు, గంటస్తంభం, మీదుగా కార్పొరేషన్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుతం వాయు కాలుష్యం గణనీయంగా పెరుగుతోందన్నారు. దీనివల్ల మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మీథేన్ ఉద్గారాలు పెరగడం వల్ల ఆకాశంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. స్వచ్ఛమైన వాయువును నిలబెట్టుకోవాలంటే కాలుష్య కారకాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

గంజాయి రవాణా చేస్తే చర్యలు

డెంకాడ: గంజాయి రవాణా చేసినా, విక్రయాలు చేపట్టినా చర్యలు తప్పవని ఎస్సై సన్యాసినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌కు పుట్టినిల్లు కొండవెలగాడ..

నెల్లిమర్ల రూరల్: వెయిట్ లిఫ్టింగ్ క్రీడకు పుట్టినిల్లు కొండవెలగాడ అని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి. జ్ఞానశంకర్ అన్నారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు బట్టు లోకేష్, వల్లూరి రమాదేవిను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వివిధ అంతర్జాతీయ వేదికలపై గ్రామానికి చెందిన వెయిట్‌లిఫ్టర్లు సత్తా చాటి ఉన్నత స్థాయిలో స్థిర పడ్డారన్నారు. జాతీయ స్థాయిలో ఎంతో మంది పతకాలు సాధిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకువస్తున్నారని చెప్పారు. ఉన్నత స్థాయిలో స్థిరపడిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని మరిన్ని పతకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ పతివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

అనుమతులు తప్పనిసరి

డెంకాడ: వినాయక మంటపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని.. లేనివారిపై చర్యలు తప్పవని ఎస్సై ఎ. సన్యాసినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగిల్ విండో పద్ధతి ద్వారా డెంకాడ పోలీస్టేషన్‌కు సమాచారం తెలియజేయాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం..



విజయనగరం: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అవనాపు విక్రమ్, తదితరులు



విజయనగరం రూరల్: మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కాలుష్య నియంత్రణ అధికారులు



భోగాపురం: మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి



నెల్లిమర్ల: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం: మట్టితో చేసిన గణపతి విగ్రహాలనే పూజిద్దామని వైఎస్సార్‌సీపీ సీనియర్ యువ నాయకుడు అవనాపు విక్రమ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్యాంక్ కాలనీ గల బాలాజీ వాకర్స్ క్లబ్ వద్ద శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఉన్న ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలకు పూజలు చేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

కోట కూడలి వద్ద విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1500 మట్టి ప్రతిమలను పట్టణ వాసులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కనక సింహాచలం, కార్యదర్శి రవి, కోశాధికారి చంద్రశేఖర్, విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్‌క్యాబ్స్ శరత్, రఘు, విజయ్, రఘురామరాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు

డెంకాడలో..

డెంకాడ: పర్యావరణ హితంలో భాగంగా అయినాడ జంక్షన్ వద్దనున్న శ్రీదేవి స్వీట్స్ యజమాని మోపాడ అప్పలనాయుడు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. గోమయ సహిత పంచగవ్య సహిత గణపతి మట్టి విగ్రహాలను ప్రజలకు ఆయన అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మేలు..

విజయనగరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలే వినియోగించాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి బీవీ సరిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ కూడలివద్ద స్థానికులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఐదుచోట్ల ఆరు వేల విగ్రహాలను పంపిణీ చేసినట్లు చెప్పారు కృత్రిమంగా లభించే పాస్టర్ ఆఫ్ పారిస్‌లో జిప్సం, గంధకం, మెగ్నీషియం వంటి హానికర రసాయనాలు కలపడం వల్ల పర్యావరణానికి ఎంతో హాని జరుగుతుందన్నారు. ఇటువంటి విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కలుషితమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..

భోగాపురం: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండల కేంద్రం భోగాపురంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమలో జనసేన నాయకులు వరుపుల సుధాకర్, గుండపు సూరిబాబు, నానాజీ, వందనాల రమణ, బొల్లు త్రినాథ్, పల్లంట్ల జగదీష్, వురుపుల గిరి, పల్ల రాంబాబు, మాత నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించాలి..

నెల్లిమర్ల: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. వివిధ రకాల రసాయనాలను పూసి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల స్థానంలో నీటిలో సులభంగా కరిగిపోయే మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని కోరారు. నగర పంచాయతీ పరిధిలోని రామతీర్థం జంక్షన్‌లో రామతీర్థం సేవాసంఘం సభ్యులు ఆల్తి శ్రీనివాసరావు, రేగాన గోవింద్ ఆధ్వర్యంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, రామతీర్థం సేవా సంఘ ప్రతినిధులు ముంతా ప్రసాదరావు, లెంక అప్పలనాయుడు, కలిశెట్టి కన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల వైస్‌చైర్మన్ శ్రీనివాసరావు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

డెంకాడ: సీనియర్, జూనియర్ అన్న తేడా లేకుండా విద్యార్థులందరూ సోదరభావంతో మెలగాలని లెండి ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు, కరస్పాండెంట్ కె. శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినూత్న ఆలోచనలు, విభిన్నమైన అభిరుచులతో ఇంజనీరింగ్ చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించే సర్టిఫికెట్ కోర్సులను కూడా అభ్యసించాలని చెప్పారు. ఇంజనీరింగ్ విద్య సమాజ అవసరాలను తీర్చే విధంగా ఆలోచనలు చేసి వాటిని ఆవిష్కరించాలన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, కేవీ నర్సింహం, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్‌బాబు, విభాగాధిపతులు రామారావు, సుబ్బరామయ్య, రాజేంద్ర, ఎం.రాజన్ బాబు, వి.ప్రసాద్, జి.సతీష్‌పూజారి, పీడీ శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.